# అనురాగం

రాయవరపు సరస్వతి




"భర్తన్న గౌరవం నీకు ఏ కోశానా లేదు" అన్నాడు సత్యమూర్తి కోపంతో వూగిపోతూ.

"మీకు వుంది మహాభార్యమీద ప్రేమ!" అంది వెటకారంగా చేతులు వూపుతూ పార్వతి.

"ఇలా మాటకు మాటా ఇస్తే వున్నది ప్రేమ కాదు, దవడపళ్ళురాలగొడ తాను."

"హుఁ! మీరు నా పళ్ళు రాలగొడ తారు, మా వాళ్ళు వచ్చి మీ పళ్ళు రాలగొడతారు" అంది కోపంగా పార్వతి.

"నువ్వూ నీ పుట్టింటివాళ్ళూ కలిసి గంగలో దూకండి. బెదిరింపులు మాత్రం బాగా నేర్చు కొచ్చావు, నీ వాళ్ళకు సంస్కారముంటేగా నీకు ఉండ డానికి" అన్నాడు ఉక్రోషంగా సత్యమూర్తి. భార్యపై చెప్పలేనంత కోపం వస్తున్నా కొట్టడానికి మనసొప్పడం లేదు.

"అవును మీకూ మీ వాళ్ళకు బోలెడంత సంస్కార ముంది. ఆ మాటనడానికి సిగ్గులేకపోతే సరి, తగుదు నమ్మాని వారానికొకరు చొప్పున నల్గురక్కచెల్లెళ్ళు వచ్చి అన్న కొంపని 'కొల్లేరు' చేసి పోతారు. ఈయన గారేమో వెనకాముందూ చూడకుండా వచ్చినప్పుడల్లా చీరా, సారెలతో సాగనంపుతుంటారు. కట్టుకున్న పెళ్ళా నికి జాకెట్టు ముక్కకి గతిలేదు కాని, అప్పచెల్లెళ్ళకు మాత్రం అప్పులు చేసి గొప్పలకు పోతారు. ఇదీ మీకున్న సంస్కారం" ముక్కు చీదుతూ చేతిలో వున్న పిల్లాణ్ని రెండు బాదుతూ అంది పార్వతి.


"మళ్ళీ మా చెల్లెళ్ళ మాట ఎత్తావంటే ఇంట్లోంచి గెంటేస్తాను. పెట్టింది తినేసి పడివుండు!"

"ఆ... ఆఁ వుంటాను. ఎందుకుండనూ. మీకు, మీ చెల్లెళ్ళకూ సేవలు చేసుకుని, మీరు పోసిన గంజి తాగి పడివుండడానికి నేనేమీ గతిలేనిదానిని కాదు మీ చెల్లెళ్ళకు మల్లే! తల్లిదండ్రులు లేనివారు కదాని వాళ్ళు వచ్చినప్పుడల్లా పురుళ్ళని, పుణ్యాలని చూస్తూనే వున్నాను. అయినా ఇలా వచ్చినప్పుడల్లా చీరెలు పెట్టాలా ? ఏదో పండగనాడు తప్పనిసరి. ఇలా అప్పులు చేసి నా కొంప ముంచితే వూరుకునేది లేదు!"

"ఏం చేస్తావేం! ఒక్కగానొక్క అన్నయ్యను కదాని నా అక్కచెల్లెళ్ళు నా ఇంటికి వస్తే చూడలేక ఏడుస్తు న్నావు. సమయానికి నా దగ్గర సొమ్ము లేక అప్పు చేస్తున్నాను, దానిని తీర్చేది నేనేగాని, నువ్వూ, నీ వాళ్ళూ కాదులే! నోర్మూసుకుని వుండు."

"ఆ... ఆ. నేను అనుభవించేది కాకుండా, నా వాళ్ళకేం ఖర్మ మీ అప్పులు తీర్చడానికి? అసలు ఇదంతా నా ఖర్మమికోవాలి. అందుకే అంటారు ఆడపిల్లను ఇచ్చి నప్పుడు వెనకాముందూ చూసి ఇవ్వాలని. మా వాళ్ళు మిమ్మల్ని, మీ ఉద్యోగాన్ని చూసి పొంగిపోయారేగాని, మీ వెనక ఇంత పటాలం బయలుదేరుతుందని వాళ్ళకేం తెలుసు! ఒక్కగానొక్క కొడుకని చెప్పి మీ 'అమ్మా నాన్నా బోలెడంత కట్నం కూడా పడేసు కున్నారు. అదంతా కూతుళ్ళకే ధారబోసారు. వాళ్ళేమో గుటుక్కుమని కూతుళ్ళ బాధ్యతంతా నా నెత్తిమీదకు రుద్ది చక్కా పోయారు. ఏనాడో పాపం చేసుకున్నాను" ముక్కు ఎగపీలుస్తూ, చేతులు తిప్పుతూ ఆవేశంగా అంది పార్వతి.

"నీది కాదే ఖర్మ నాది! ఇంట్లో రోజూ ఈ పోరు




భరించలేకుండా వున్నాను. అవతల ఆఫీసుకెళ్తే ఊపి రాడని పని, ఇంటికి వస్తే ఈ గోల! అసలు మగవాడిగా పుట్టినంత దురదృష్టం ఇంకోటి లేదు'' నెత్తి బాదు కున్నాడు సత్యమూర్తి.

"పాపం ఎంత కష్టపడి పోతున్నారు! ఇంట్లో వుండి పిల్లల్ని చూస్తూ వంటపని, ఇంటిపని చేస్తే తెలుస్తుంది. టింగురంగాని ఇస్త్రీ బట్టలు కట్టుకొని బస్సులో ఆఫీసు కెళ్ళి వచ్చినట్టు కాదు ఇంట్లో పని చెయడం! నా కష్టం మీకేం తెలుస్తుంది?''

"అంత కష్టంగా వుంటే పుట్టింటికి పో, నా పాట్లేవో నేను పడతాను. మొగుడికి, పిల్లలకు వండి పెట్టడానికి ఏడుస్తావు.''

"మీకు అంత కష్టంగా వుంటే పోతానులెండి! కొత్త పెళ్ళాముొస్తే సింగారిద్దామని చూస్తున్నారు కాబోలు, అదీ చూస్తాను......''

వింటున్న సత్యమూర్తి కోపం భరించలేక భార్య చెంప ఛెళ్ళుమనిపించాడు.

"జాగ్రత్తగా వుండు. ఊరుకుంటుంటే మితిమీరి పోతున్నావు. నీకు నా దగ్గర వుండడం ఇష్టంలేకపోతే నీ దిక్కున్న చోటకు వెళ్ళిపో. ఈ బెదిరింపులు, సాధింపులు నేనిక భరించలేను'' అంటూ బట్టలు వేసుకొని టైమవడంతో ఆఫీసుకు వెళ్ళిపోయాడు సత్యమూర్తి.

పార్వతి నిర్ఘాంతపోయి చూస్తూండిపోయింది. పెళ్ళయి పది సంవత్సరాలైంది. భర్త ఏనాడూ తన ఒంటిపై చెయ్యి వెయ్యలేదు. ఈ నాడు కొట్టాడంటే అది తన మూర్ఖత్వం వల్లనే జరిగివుంటుంది. ఛ, ఇంత చదువుకొని కూడా అంత సిగ్గులేని దానిగా ప్రవర్తించింది తనేనా? అంత శాంతమూర్తికి కోపం వచ్చిందంటే..'తన ప్రవర్తనపై తనకే కోపం వచ్చింది. అసహ్యంకూడా వేసింది.'ఇప్పుడు పట్టుదలకి పుట్టింటికి వెళ్తే అక్కడ తనేమని చెప్పకుంటుంది! అసలు ఆడది అలిగి పుట్టింటికి వెళ్ళకూడదన్న సామెత కూడా వుండనే వుంది...'ఆ ప్రయత్నం విరమించుకుంది. కూతురు ప్రమీల తాతగారింట్లో వుంది. రెండేళ్ళ కొడుకుని పక్కలో వేసుకొని దుప్పటి ముసుగు పెట్టి పండుకుంది. భర్త కాఫీకూడా తాగలేదన్న విషయం జ్ఞప్తికి వచ్చి ఆమె మనస్సు చివుక్కుమంది.

మధ్యాహ్నం ఇంటికి వచ్చిన సత్యమూర్తి బట్టలు మార్చుకొని కాళ్ళూచేతులూ కడుగుకొని భోజనానికి వచ్చి వంటింట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. భార్య ఎంతకీ రాకపోవడంతో అతడికి వంట చేయలేదేమోనన్న అనుమానం వచ్చి లేచి గిన్నెలన్నీ తనిఖీచేశాడు. ఖాళీగా వున్నాయి. వెంటనే మళ్ళీ బట్టలు వేసుకొని భార్య పడుకున్న గదివైపు ఓ మారు చూసి ఆఫీసు కెళ్ళిపోయాడు. ఇదంతా పడుకొని ఓరగా చూస్తున్న పార్వతి బాధ పడింది. వంటచూసి భర్తను ఆకలితో వుంచినందుకు తనను తనే తిట్టుకుంది. అసలు భర్త వచ్చి తన అలకను తీర్చుతాడనుకుంది. కానీ ఇలా మౌనంగా వెళ్ళిపోతాడను కోలేదు.'పాపం ఎంతాకలి వేసిందో!'అనుకొని వెంటనే లేచి స్నానం చేసి సాయంత్రం వంటపనిలో నిమగ్నమై పోయింది.

** ** ** **

ఆఫీసుకు వెళ్ళిన సత్యమూర్తికి పని చేయాలని పించలేదు. అతడి మనసంతా చికాకుగా వుంది. పదేపదే ఉదయం భార్యకూ, తనకూ జరిగిన ఘర్షణే గుర్తు కొస్తూంది.'తను ఆవేశంలో అనవసరంగా ఈ రోజు భార్యపై చెయి చేసుకున్నాడు. తను పెండ్లయిన పది సంవత్సరాలలోనూ ఏనాడూ ఇటువంటి పొరపాటు జరగలేదు. అసలు పార్వతి మంచి ఇల్లాలిగా అందరి లోనూ మంచిపేరు తెచ్చుకుంది. పార్వతి వచ్చిన తర్వాతనే తన నల్గురు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళయ్యాయి. ఆ తర్వాత తల్లిదండ్రులు పోయారు. అప్పట్నుంచి తన నల్గురు చెల్లెళ్ళనే పార్వతి తల్లిలా ఆదుకుంది. వారికి అత్త వారింట్లో ఏ లోపమూ జరగకుండా ముందుగా జాగ్రత్త పడేది. ఒకరి తరువాత ఒకరు పురుళ్ళకు వస్తే సేవలు చేసి మళ్ళీ తల్లీ బిడ్డను లక్షణంగా అత్తవారింటికి పంపేది. కానీ ఈ రోజు తొందరపడింది...... అసలు ఈ ఘర్షణకు ముఖ్యకారణమేమంటే — నాలుగు రోజుల కిందట తన ఆఖరు చెల్లెలు రాధ వచ్చింది. ఆమె అంటే తనకు వల్లమాలిన అభిమానం. రాధ తను ఇంట్లో ఇబ్బందులను ఏకరువుపెడుతూ కొంతపైకం కావాలని కంటతడిపెట్టింది. సమయానికి తన దగ్గర సొమ్ము లేకపోయింది. అందువలన తప్పనిసరిగా అప్పు చేసి అయిదు వందల రూపాయిలు ఇచ్చి, చీరపెట్టి,కావల్సిన సరకులు కొని ఆమెను ఈ రోజు ఉదయం పంపించివేశాడు. ఈ ప్రకారంగా నల్గురు చెల్లెళ్ళూ వచ్చి తన వద్దనుంచి ఏదో ఒక వంకన సొమ్ము రాబట్టుకు వెళ్తూనేవున్నారు. తను అప్పచేసి ఇవ్వక తప్పటం లేదు. తల్లిదండ్రులు లేని పిల్లలు మరి. తనుగాక ఎవరు చూస్తారు? ఈ పద్ధతి పార్వతికి నచ్చడంలేదు. మన దగ్గరున్నదేదో ఇచ్చి పంపుతున్నాము కదా! ఇలా అప్పులు చేసి గొప్పలకు పోవద్దంటుంది! పార్వతి చెప్పింది కూడా మంచి పద్ధతే. కానీ తన బాధ్యత తను మర్చిపోలేక పోతు న్నాడు. తను చేస్తున్నది గుమస్తా ఉద్యోగం. ఇదంతా మోయాలంటే కష్టంగా వుంది. తనకూ పెళ్ళయి పది సంవత్సరాలైంది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. ఈ పదేళ్ళ కాలంలో పార్వతి ఏనాడూ తన స్వంతానికై అది కావాలి, ఇది కావాలి అని అడగలేదు. ఆమె పుట్టింటి వారు కలిగినవారు కావటంతో ఆమెకు ఏ లోటూ రానివ్వరు. ఆ కారణంగా ఆమె విషయంలో తనూ కాస్త నిర్లక్ష్యంచేశాడు. ఆమెకు తన ప్రేమను, అనురాగాన్ని పంచిఇవ్వటమే తప్ప ఏనాడూ ఒక్క చీర కొనివ్వలేదు. ఈనాడు ఎంతో బాధ కలగకపోతే ఆ విధంగా ప్రవర్తించదు!'మధ్యాహ్నం భోజనమైనా చేయకుండా పడుకున్న పార్వతి రూపమే గుర్తుకొస్తోంది. అతడు ఆఫీసులో నిలవలేక పర్మిషను అడిగి రోజూకంటే ముందుగానే ఇంటికి వచ్చేశాడు. పార్వతికోసం వెదికాడు. ఆమె వంటింట్లో వుంది. భర్త రాకను చూసిన పార్వతి చప్పున లేచి నిలబడింది. భర్త ముఖంలోకి చూసింది. నీరసంగా కనబడింది. ఆమె కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. తప్పు చేసినట్లు చప్పున ముఖం దించుకొని చేతుల్తో కప్పు కుంది. ఆమె కన్నీరు చెంపలను తడుపుతోంది.

"క్షమించు పార్వతీ, ఆవేశంలో పొరపాటు జరిగి పోయింది. ఇంకెప్పుడూ ఇలా జరగనివ్వనని ప్రామిస్ చేస్తున్నాను'' అన్నాడు ఆమె తలపై చేయివేసి నిము రుతూ.

ఇక నిలువలేని పార్వతి అతన్ని కౌగిలించుకొని బావురుమంది.

"అంత మాటనకండి. నేనే మీ మనసు నొప్పించాను. ఈ రోజు మిమ్మల్ని ఆకలితో వుంచాను. ఆవేశం అనర్థాలకు దారితీస్తుందని, అనురాగమే ఎల్లవేళలా నిలుస్తుందని ఈనాడే గ్రహించాను. మరెన్నడూ మిమ్మల్ని నిసిగించను'' అంది అతన్ని హత్తుకుపోతూ.

"పిచ్చి పార్వతీ! నీ మనసు నాకు తెలీదనుకున్నావా! పద భోజనం చేసి సినిమాకి పోదాం'' అంటూ హుషారుగా బాత్‌రూమ్ వైపు నడిచాడు.

పార్వతి తృప్తిగా అతడివైపు చూసి నవ్వుకుంది.